సంక్షిప్త వార్తలు

• దళిత సర్పంచ్‌ను చెట్టుకు కట్టేసి చిత్రహింసలు

మోరెనా, జూన్ 7: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో దళితులకు రక్షణ లేకుండా పోతున్నది. దళిత సర్పంచును కొందరు వ్యక్తులు చెట్టుకు కట్టేసి చితకబాదారు. మోరెనా జిల్లాలోని కొతర్‌కలాన్ పంచాయతీ సర్పంచ్‌ను వెంటనే పదవి విడిచిపెట్టి ఊరు నుంచి వెళ్లిపోవాలని గత రెండేళ్లుగా కొందరు వేధిస్తున్నారు. దానికి అతడు ఒప్పుకోకపోవడంతో అతడిని చెట్టుకు కట్టేసి చిత్రహింసలు పెట్టారు. బాధితుడు గురువారం పోర్సా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గూండాల వేధింపులు తాళలేక సర్పంచ్ గ్రామాన్ని విడిచిపెట్టారని స్థానికులు తెలిపారు.

• హౌతీ రెబల్స్ నిర్బంధంలో ఐరాస ఉద్యోగులు

దుబాయ్: ఐక్యరాజ్యసమితికి చెందిన వివిధ ఏజెన్సీల సిబ్బందిని హౌతీ రెబల్స్ నిర్బంధించారు. వీరి నిర్బంధంలో 9 మంది యెమెన్ ఉద్యోగులు, ఇతరులు ఉన్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు వైమానిక దాడులు చేస్తుండటంతో హౌతీ రెబల్స్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. వీరి నిర్బంధంలో ఉన్నవారిలో సహాయక బృందాల సభ్యులు కూడా ఉండి ఉండవచ్చునని తెలిపారు. ఈ రెబల్స్ ఎర్ర సముద్రంలో ప్రయాణించే నౌకలపై దాడులు చేస్తూ ఉంటారు.

• పాక్ సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ ప్రస్తావన

ఇస్లామాబాద్: భారత దేశంలో ఎన్నికల ప్రచారం కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిలు ఇచ్చారని పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ ఆ దేశ సుప్రీంకోర్టుకు చెప్పారు. ఫిబ్రవరి 8న జరిగిన పాక్ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా నిరోధించేందుకు ఐదు రోజుల్లోనే తనను దోషిగా తీర్పు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 ఏప్రిల్‌లో తాను పదవిని కోల్పోయానని, అప్పటి నుంచి తనను విపరీతంగా వేధిస్తున్నారన్నారు. తనను అప్రకటిత మార్షల్ లా క్రింద అణగదొక్కుతున్నారని వాపోయారు. ప్రస్తుతం జైలులో ఉన్న ఇమ్రాన్‌ను నేషనల్ అకౌంటబిలిటీ ఆర్డినెన్స్‌కు సవరణలకు సంబంధించిన కేసులో విచారణ కోసం పాక్ సుప్రీంకోర్టులో గురువారం హాజరుపరిచారు.

• జయంత్‌కు బ్యాక్ సీట్‌పై వివాదం

న్యూఢిల్లీ: ఎన్డీయే సమావేశంలో ఆర్‌ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరిని బీజేపీ అవమానించిందని సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎన్డీయే పక్ష నేతగా నరేంద్ర మోదీని ఎన్నుకున్న ఈ సమావేశంలో టీడీపీ, జేడీయూ, తదితర పార్టీల నేతలను వేదికపై మోదీ పక్కనే కూర్చోబెట్టారని, జయంత్‌ను మాత్రం ఇతర ఎంపీలతోపాటు కూర్చోబెట్టారని మండిపడ్డాయి. మహా రైతు నేత చౌదరి చరణ్ సింగ్ మనుమడిని బీజేపీ అవమానించిందని వ్యాఖ్యానించాయి. రైతుల గౌరవం పట్ల జయంత్‌కు నిబద్ధత ఉంటే, ఆత్మాభిమానం ఉంటే, ఆయన ఎన్డీయేను వదిలిపెట్టాలని, తిరిగి ఇండియా కూటమిలోకి రావాలని పిలుపునిచ్చాయి. దీనిపై ఆర్‌ఎల్‌డీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ స్పందిస్తూ, తమను ఇండియా కూటమి ఎప్పుడు గౌరవించిందని ప్రశ్నించారు. ఎన్డీయేలో ఆర్‌ఎల్‌డీ ప్రధాన భాగస్వామి అని, అలాగే కొనసాగుతుందని చెప్పారు.

• 'ఎన్డీయే అంటే నితీశ్-నాయుడు డిపెండెంట్ అలయన్స్'

న్యూఢిల్లీ: ఎన్డీయే అంటే 'నితీశ్-నాయుడు డిపెండెంట్ అలయన్స్' ('నితీశ్-నాయుడుపై ఆధారపడ్డ కూటమి) అంటూ కాంగ్రెస్ కొత్త నిర్వచనం ఇచ్చింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ రాని బీజేపీ ఎన్డీయే పక్షాలైన టీడీపీ, జేడీయూపై ఆధారపడే పరిస్థితి తలెత్తింది. శుక్రవారం జరిగిన కూటమి సమావేశంలో మోదీ చేసిన గంటసేపు ప్రసంగంలో ఎన్డీయే పేరును తలచినంతగా, గత పదేండ్ల పాలనలో ఎన్నడూ కనీసం ప్రస్తావించిన పాపాన పోలేదని కాంగ్రెస్ విమర్శించింది. కాగా, 10 ఏండ్ల పాలనలో నిత్యం రాజ్యాంగాన్ని ఆడిపోసుకున్న మోదీ శుక్రవారం దానిని కళ్లకు అద్దుకోవడం 'డ్రామా' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

• ఓడిన 'ఇండియా' అభ్యర్థులకు సన్మానాలు: అఖిలేశ్

లక్నో: లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన ఇండియా కూటమి అభ్యర్థులను 'సమ్మాన్‌సద్' బిరుదుతో సత్కరిస్తామని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఎన్నికల ఫలితాలపై ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ, బీజేపీ పాల్పడిన పాలనపరమైన కుంభకోణాల కారణంగా గెలవలేకపోయిన తమ అభ్యర్థులంతా వాస్తవంగా విజేతలేనని తాము నమ్ముతున్నామన్నారు. బీజేపీకి లభించిన ఓట్లు ప్రజలు వేసినవి కాదన్నారు. ఆ పార్టీ పరిపాలనా విధానం, వారి కుంభకోణాల వల్లే ఆ పార్టీకి ఓట్లు వచ్చాయన్నారు. ప్రజలు పూర్తిగా ఇండియా కూటమి అభ్యర్థులకే మద్దతిచ్చి, గౌరవించారని, అందుకే అలాంటి అభ్యర్థులందరినీ నిజమైన ప్రజా ప్రతినిధులుగా పరిగణిస్తున్నామని తెలిపారు.

నీట్‌గా అక్రమాలు!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నారనే వార్తలు రావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనుమానాలు మొదలయ్యాయి.

మార్కులు కలపడం వల్లే టాపర్లు పెరిగారు: ఎన్‌టీఏ

ఎక్కువ మందికి ఇలా అధిక మార్కులు రావడానికి, టాపర్లు కావడానికి ఫిజిక్స్‌లో వచ్చిన ఒక ప్రశ్నే కారణమని పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) చెప్తున్నది. ఈ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నకు.. ఎన్సీఈఆర్‌టీ కొత్త టెస్టుబుక్ ప్రకారం ఒక సమాధానం, పాత టెస్టుబుక్ ప్రకారం మరో సమాధానం సరైనవి. మొదట ఒక్క సమాధానానికే ఎన్‌టీఏ మార్కులు ఇస్తూ కీ విడుదల చేసింది. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు రావడంతో రెండు సరైన సమాధానాల్లో ఏది రాసినా మార్కులు వేసినట్టు ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ నిర్ణయంతో 44 మంది అభ్యర్థులకు మార్కులు 715 నుంచి 720కి పెరిగినట్టు వివరించింది. ఈసారి పరీక్షా పత్రం సులువుగా ఉండటం, గత ఏడాది కంటే దాదాపుగా మూడు లక్షల మంది ఎక్కువగా పరీక్ష రాయడం కూడా టాపర్లు పెరగడానికి కారణమని పేర్కొన్నది.

నీట్ అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు చేసిన ట్వీట్స్

కోర్టుకు చేరిన వివాదం

నీట్ ఫలితాల విషయంలో వివాదం కోర్టుకు చేరింది. నీట్ ఫలితాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గ్రేస్ మార్కుల కేటాయింపులో తప్పులు జరిగాయని, ఫలితంగా అభ్యర్థులు అడ్మిషన్లు పొందడంలో నష్టపోతారని న్యాయవాది తన్మయ్ ఛటోపాధ్యాయ్ కోర్టుకు తెలిపారు. దీంతో ఫలితాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై 10 రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఎన్‌టీఏను జస్టిస్ కౌశిక్ చంద్ర ఆదేశించారు. మరోవైపు రెండు జవాబులు ఉన్న ప్రశ్నకు సమాధానం రాయకుండా వదిలేసిన వారికి కూడా మార్కులు కలపాలని కోరుతూ ఓ అభ్యర్థి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండు జవాబులు సరైనవి కావడంతో ఏ జవాబును రాయకుండా వదిలేశామని, నీట్‌లో ఒక్క మార్కుతోనూ ర్యాంకులో భారీ తేడా వస్తుంది కాబట్టి మార్కులు కలపాలని అభ్యర్థి కోరారు. ఈ పిటిషన్‌పై అభిప్రాయం తెలపాల్సిందిగా ఎన్‌టీఏను వెకేషన్ బెంచ్ జడ్జి జస్టిస్ డీకే శర్మ ఆదేశించారు.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి

నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో జూదం ఆడుతున్నారని, కచ్చితంగా దీనిపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ మరో నేత జైరామ్ రమేశ్ కోరారు. నీట్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ హర్యానాలోని జింద్‌లో విద్యార్థులు ఆందోళనకు దిగారు. హర్యానాలో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి టాప్ ర్యాంకులు వచ్చాయని వీరు పేర్కొన్నారు. నీట్ పరీక్ష విధానంలో ఎవరికీ 718, 719 మార్కులు వచ్చే అవకాశం లేదని, కానీ ఫలితాల్లో ఇలా వచ్చాయని తెలిపారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరుతూ పలువురు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీట్ 2024లో భారీ అవినీతి: బీఆర్‌ఎస్వీ

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో నీట్ 2024 పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారని బీఆర్‌ఎస్వీ ఓయూ నాయకుడు నాగేందర్ కోదాటి ఆరోపించారు. కేంద్రప్రభుత్వం, ఎన్‌టీఏలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 67 మందికి 720 మార్కులు వచ్చాయని గుర్తు చేశారు. ఇది సాధ్యంకానిదని మేధావులు, వైద్యులు ఘంటాపథంగా చెబుతున్నారన్నారు. ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720 మార్కులు రావడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 180 ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కుల చొప్పున మొత్తం 720 మార్కులకు పరీక్ష నిర్వహించగా, 719, 718 మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. విద్యార్థులు ఎంతో కష్టపడి పెద్ద పెద్ద నగరాల్లో లక్షలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నప్పటికీ, ఎన్‌టీఏ అవినీతితో అదంతా వృథా అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవినీతి వెనుక పెద్దపెద్ద రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఉన్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్‌టీఏ డైరెక్టర్‌ను తక్షణమే అరెస్టు చేసి, సీబీఐకి కేసు అప్పగించాలని డిమాండ్ చేశారు. పరీక్షను తిరిగి నిర్వహించాలని, అప్పుడే విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు.

• అంతరిక్షంలో సునీత.. ఆనందంతో కేరింత

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆనందంతో డ్యాన్స్ చేశారు. బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక ద్వారా ఐఎస్‌ఎస్‌కు చేరుకున్న విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌కు అక్కడి వారు గంట కొట్టి స్వాగతం పలికారు. అక్కడ ఉన్న ఇతర వ్యోమగాములను సునీత ఆలింగనం చేసుకున్నారు.

చక్కెర వ్యాధికి చుక్కల మందు

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించిన పరిశోధనల్లో విజయవంతం అయ్యిందని, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు నియంత్రణలోకి వచ్చాయని వివరించారు. ప్రస్తుతం ఈ డ్రాప్స్ పేటెంట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశామని, త్వరలోనే మార్కెట్‌లోకి విడుదల చేసే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

రష్యాలో నదిలో పడి నలుగురు భారతీయ విద్యార్థుల మృతి

న్యూఢిల్లీ/ముంబై, జూన్ 7 (నమస్తే తెలంగాణ): రష్యాలో మెడిసిన్ చదువుతున్న నలుగురు భారతీయ విద్యార్థులు ఓ నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మరో విద్యార్థిని రక్షించారు. ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతున్నది. మన దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం, రష్యాలోని వెలికీ నోవ్‌గోరోడ్‌లో ఉన్న యారోస్లావ్ ది వైజ్ నోవ్‌గోరోడ్ స్టేట్ యూనివర్సిటీలో వీరు చదువుతున్నారు. వీరు మహారాష్ట్రలోని జలగావ్‌కు చెందిన వారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఇండియన్ కాన్సులేట్ వెంటనే స్పందించి, స్థానిక అధికారులతో, విశ్వవిద్యాలయంతో సంప్రదిస్తూ, సహాయం అందిస్తున్నది. అదే విధంగా మహారాష్ట్రలోని జలగావ్‌లో ఉన్న ఈ విద్యార్థుల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులతో కూడా మాట్లాడుతున్నది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

11వ తరగతి ఫెయిల్.. ఇప్పుడు డిప్యూటీ కలెక్టర్

మధ్యప్రదేశ్‌లో రైతు కుమార్తె ఘనత



ఇండోర్: ఆమె ఒక రైతు కుమార్తె.. 11వ తరగతిలో ఫెయిలయ్యింది. తన వైఫల్యాన్నే విజయంగా మార్చుకుంది. ఇప్పటికే ప్రభుత్వ శాఖలో ఉన్నత ఉద్యోగం చేస్తున్నా తృప్తి పడలేదు. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీపీఎస్సీ) పరీక్షలో ఆమె ఆరో ర్యాంకు సాధించడంతో త్వరలో డిప్యూటీ కలెక్టర్ కానుంది. ప్రియా యాదవ్‌కు చెందిన ఈ కథ ఎందరికో ఆదర్శం. పట్టుదల, కృషితో ప్రణాళికాబద్ధంగా చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా అవలీలగా ఛేదించవచ్చునని ఆమె ఉదంతం తెలియజేస్తున్నది. 10వ తరగతిలో తాను క్లాస్ టాపర్‌నని, అయితే బంధువుల ఒత్తిడి మేరకు తనకు ఇష్టం లేకున్నా 11వ తరగతిలో సైన్స్ సబ్జెక్టు చదివి ఫిజిక్స్‌లో ఫెయిల్ అయినట్టు 27 ఏండ్ల ప్రియా యాదవ్ తెలిపింది.

పుట్టిన రోజు ఒక్కటే.. ఇప్పుడు మరణించిన రోజు కూడా..

ట్రెక్కింగ్‌లో మృతి చెందిన దంపతుల విషాదం

బెంగళూరు: ఉత్తరాఖండ్‌లోని హిమాలయ పర్వతాల్లోని సహస్త్రతల్ సరస్సు వద్దకు ట్రెక్కింగ్‌కు వెళ్లి మరణించిన కర్ణాటకకు చెందిన భార్యాభర్తలకు సంబంధించిన విషయం అందరినీ కలచివేస్తున్నది. ట్రెక్కింగ్‌కు వెళ్లిన బృందంలో ప్రతికూల వాతావరణంలో చిక్కుకుని 9 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిలో కర్ణాటక హుబ్బళికి చెందిన భార్యాభర్తలు వినాయక్ ముంగురవాడీ, సుజాత ముంగురవాడీ కూడా ఉన్నారు. వీరిద్దరూ 1994లో హుబ్బళిలోని బీవీబీ కాలేజీలో ఇంజినీరింగ్ చదివారు. ఇద్దరి పుట్టిన రోజు ఒక్కటే. ఇప్పుడు మరణించిన రోజు కూడా ఒక్కటే కావడం విషాదం. 1996 నుంచి వీరు బెంగళూరులో ఉంటున్నారు. ప్రైవేట్ కంపెనీలో పనిచేసే వినాయక్ స్నేహాలోక అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా గత 16 ఏండ్లుగా సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో అనేకమందికి సహాయం చేశారు. ప్రతి ఏడాది వినాయక్ ట్రెక్కింగ్‌కు వెళ్తుంటారు. ఈ ఏడాది భార్యతో వెళ్లారు. కానీ అక్కడ వాతావరణం అనుకూలించకపోవడంతో మంచులో కూరుకుపోయి ఇద్దరూ మరణించారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలి

- పునఃప్రారంభంలోపు పాఠశాలలను తీర్చిదిద్దాలి
- 'ఆదర్శ' పాఠశాలల పరిశీలనలో ఖమ్మం కలెక్టర్

నాగిలిగొండ పాఠశాలలో హెచ్ఎంతో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

చింతకాని, జూన్ 7: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రభుత్వం కేటాయించిన నిధులతో మౌలిక వసతులను మెరుగుపర్చాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వాటిల్లో చేపట్టిన పనులను పాఠశాల పునఃప్రారంభంలోపు యుద్ధప్రాతిపదికన పూర్తి కావాలని ఆదేశించారు. చింతకాని మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. రాఘవాపురం, లచ్చగూడెం, నేరడ, నాగిలిగొండ తదితర గ్రామాల్లోని పాఠశాలలను, వాటిల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. పాఠశాలల్లో జరుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో ఎంపిక చేసిన పనులు, మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు, ర్యాంపులు తదితర మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే, బడిబాట కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని సూచించారు. అలాగే, పాఠశాలలకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు వచ్చాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డీఈవో సోమశేఖరశర్మ, ఎంపీడీవో రామయ్య, తహసీల్దార్ రమేశ్, ఎంఈవో శ్యాంసన్, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు శ్రీరాంకుమార్, వల్లంకొండ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు హతం

గాయపడిన ముగ్గురు జవాన్లు

కొత్తగూడెం క్రైం, జూన్ 7 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం తుపాకీ గుండ్ల శబ్దాలతో దద్దరిల్లిపోయింది. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య శుక్రవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు. నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పోలీస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో నారాయణ్‌పూర్, కొండగావ్, దంతేవాడ, జగ్దల్‌పూర్ జిల్లాల డీఆర్‌జీ బలగాలు, ఐటీబీపీ 45వ బెటాలియన్ భద్రతా బలగాలు సంయుక్తంగా ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. అయితే జవాన్లు సైతం నాలుగు వైపుల నుంచి మూకుమ్మడి దాడి చేయడంతో మావోయిస్టులు తప్పించుకునే మార్గం లేకపోయినట్లు తెలుస్తోంది. దాడుల్లో సుమారు 1,200 మంది జవాన్లు పాల్గొన్నట్లు సమాచారం. దీంతో మావోయిస్టులు తప్పించుకునే దారిలేక వారి వద్ద ఉన్న తుపాకులను ఎక్కుపెట్టి కాల్పుల వేగాన్ని పెంచుకుంటూ అటవీ మార్గం నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం నుంచి ఎదురు కాల్పుల్లో మృతి చెందిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఒక ఎస్‌ఎల్‌ఆర్ ఆయుధం, ఇతర మారణాయుధాలు, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్స్ ముమ్మరంగా జరుగుతున్నాయి. కాగా.. ఘటనలో ముగ్గురు జవాన్లకు సైతం గాయాలైనట్లు పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది. పోలీస్ అధికారులు ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ధ్రువపర్చాల్సి ఉంది. నారాయణ్‌పూర్ జిల్లా అబూజ్‌మడ్ పరిధిలో గల నయా ఇరకభట్టి పోలీస్ క్యాంపుపై మావోయిస్టులు మెరుపుదాడి చేసి యూబీజీఎల్ లాంచర్లను ప్రయోగించిన వీడియోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. మావోయిస్టులకు సంబంధించిన అండర్ బ్యారల్ గ్రానెడ్ లాంచర్ల విస్ఫోటనం నుంచి జవాన్లు తప్పించుకునే చిత్రాలు వీడియోలో స్పష్టంగా కనిపించడం కొసమెరుపు. అయితే ఈ ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే పోలీస్ బలగాలు ప్రతీకారం తీర్చుకున్నట్లు తెలస్తోంది. త్వరలోనే మావోయిస్టుల కంచుకోటను కూల్చేందుకు నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దులోని అబూజ్‌మడతోపాటు పరిసర ప్రాంతాలపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం విల్లు ఎక్కుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది బస్తర్ రేంజ్ పరిధిలో భద్రతా దళాలు జరిపిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన వారి సంఖ్య 120కి చేరింది. ఇప్పటికే వేల సంఖ్యలో సైన్యం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై పట్టు సాధించేందుకు చేస్తున్న సమరంలో పైచేయిగా నిలుస్తోంది. దీంతోపాటు మావోయిస్టులు సైతం ఉనికిని చాటుకునేందుకు విధ్వంసక చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు.

ప్రపంచ వరి సదస్సులో జిల్లా రైతులు

ఖమ్మం వ్యవసాయం/ వైరా టౌన్, జూన్ 7: హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ వరి సదస్సులో పాల్గొనే అవకాశం జిల్లా రైతులకు లభించింది. శుక్రవారం రాష్ట్ర రాజధానిలోని ఓ హోటల్‌లో ప్రారంభమైన ఈ సదస్సులో జిల్లా నుంచి రైతు సంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు, ఆదర్శ రైతులు అనుమోలు రామిరెడ్డి, రామకృష్ణ, రాణాప్రతాప్, లక్ష్మీనారాయణతోపాటు వైరా కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల నుంచి హాజరైన శాస్త్రవేత్తలు, వరి ఎగుమతిదారుల సదస్సులో తమకు అవకాశం కలగడం సంతోషంగా ఉందన్నారు.

సదస్సుకు హాజరైన జిల్లా రైతులు

బ్యాక్‌గ్రౌండ్ రియల్ ఎస్టేట్

- మండలంలో ఏ మూల చూసినా రియల్టర్లు, ఏజెంట్లు
- చెరబట్టినట్లుగా నేలల పెకిలింపు.. మట్టి తరలింపు
- ఏదులాపురం చెరువు నుంచి టిప్పర్లతో రవాణా
- 'రూరల్'లో నిత్యకృత్యాలుగా భూ 'పంచాయితీలు'

'మూడు పువ్వులు ఆరు కాయలు'గా మట్టి తోలకాలు..

ఇక చోటామోటా రియల్టర్ల మట్టి మాఫియా కథ 'మూడు పువ్వులు ఆరు కాయలు' అన్నట్లుగా సాగుతోంది. జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో నిత్యం వందలాది వాహనాలు మట్టిని తలిస్తూ గ్రామాల్లో పరుగులు పెడుతున్నాయి. హైవేల కాంట్రాక్టర్లకు, రేగడి మట్టి తోలుకునే రైతులకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ వారి మాటున అనేకమంది రియల్టర్లు ఈ నల్లమట్టిని వెంచర్లకు తోలుకుంటున్నారు.

ఖమ్మం రూరల్, జూన్ 7: ఏదైనా ఉద్యోగం సాధించాలంటే ఎన్నో అర్హతలు కలిగి ఉండాలి. రేయింబవళ్లూ శ్రమించి, అన్ని పరీక్షల్లోనూ అత్యంత ప్రతిభ కనబర్చి, ప్రతిభా పాటవాలతో పోటీదారులను దాటుకొని ముందుకెళ్లాలి. కానీ.. ఇప్పుడు మనం చెప్పుకోబోయే కొలువుకు ఏ విద్యార్హతా అవసరం లేదు. పోటీ పరీక్షలు ఉండవు. శారీరదారుఢ్య పరీక్షలకు తావు లేదు. చివరికి పైరవీలతోనూ పని లేదు. ఎదుటివారిని బురిడీ కొట్టించే మాటల గారడీ ఉంటే చాలు.. అదే అక్కడ అత్యంత శక్తిమంతమైన కొలమానం. అదే రియల్ ఎస్టేట్. ఈ స్థిరాస్తి వ్యాపారం కారణంగా జరిగే అభివృద్ధి, పెరిగే జీవన ప్రమాణాల సంగతి అటుంచితే.. దీని వెనుక అంతులేని అడ్డగోలు అగాధాలు కోకొల్లలు. ఖమ్మం రూరల్ మండలంలో నాలుగైదేళ్ల క్రితం వేళ్ల మీద లెక్కపెట్టే అంత సంఖ్యలో కూడా లేని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లు.. ఇటీవల కాలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. ఊరూవాడా విస్తరించారు. ఖరీదైన కార్లు, ఖద్దర్ డ్రెస్సులు ప్రదర్శిస్తూ 'బ్యాక్‌గౌండ్ రియల్ ఎస్టేట్' అనే దర్జాను చూపిస్తున్నారు. అయితే ఇంతటి దర్పాన్ని ప్రదర్శిస్తున్న ఈ రియలర్లు.. నేలలు పెలికిస్తూ.. మట్టిని తరలిస్తూ మాఫియాను మరిపిస్తున్నారు.

అందుగలదిందులేదని..

'అందుగలదిందు లేదనే సందేహము వలదు..' అన్నట్లుగా మండలంలోని ఏ మారుమూల ప్రాంతాన్ని చూసినా రియల్ ఎస్టేట్ వ్యాపారమే దర్శనమిస్తోంది. మండలంలోని 27 గ్రామ పంచాయతీలుండగా.. వాటిల్లో 15 పంచాయతీల్లో వ్యవసాయ భూములు వెంచర్లుగా మారుతున్నాయి. మండలంలో అధికారికంగా ఇప్పటివరకు 120కి పైగానే వెంచర్లు వెలువగా.. అనధికారికంగా మరో 20 నుంచి 30 వరకు వెంచర్లు ఉన్నాయి. వీటిని మార్కెటింగ్ చేసేందుకు, ప్లాట్లుగా విక్రయించేందుకు ఏజెంట్లు, దళారులు వందల సంఖ్యలో ఉన్నారు. ఈ స్థిరాస్తి వ్యాపారంలో కొన్నేళ్లుగా డీటీసీపీ సహా మరికొన్ని అనుమతులను ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో ప్లాట్ల క్రయవిక్రయాలు కొద్దిగా మందగించాయి. ఈ క్రమంలో సదరు రియల్టర్లు మట్టి దందాకు తెరలేపారు. చెరబట్టినట్లుగా వ్యవహరిస్తూ గుట్టలు, చెరువులను అడ్డగోలుగా తవ్వుతున్నారు. అయితే అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తొలుత విక్రయాలు.. తర్వాత ఫిర్యాదులు..

అయితే మండలంలో భూముల విలువలు కోట్లకు పెరగడంతో గతంలో భూములు విక్రయించిన కొందరు యజమానులు ఇప్పుడు మళ్లీ ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో భూముల 'పంచాయితీలు' నిత్యకృత్యంగా మారాయి. ఇక ఏజెంట్లు, దళారుల మాయాజాల మరోరకం. ఇలా ప్లాట్ కొనుగోలు చేసి టోకెన్ అమౌంట్ కట్టడం.. ఆ వెంటనే అలా మరొకరికి బేరం పెట్టడం వంటివి కోకొల్లలు. ఈ క్రమంలో డాక్యుమెంట్లలో ఏవైనా లోపాలొస్తే అసలు యజమాని దగ్గరకు పోవాలో లేదా మధ్యవర్తిని కలవాలో తెలియక అనేకమంది ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారు. మాటను పెట్టుబడి పెట్టి సాయంత్రానికి ఎంతో కొంత జేబులో వేసుకొని వెళ్లే వాళ్లతో అంతిమంగా వినియోగదారులు వేసారిపోతున్నారు.

వెంచర్లకు నల్లరేగడి మట్టి..

సాధారణంగా నల్లరేగడి మట్టి సాగు భూములకు అందడం చాలాకష్టం. కానీ.. మండలంలో మాత్రం కొందరు అక్రమార్కులు, రియల్టర్లు చెరువుల్లోని నల్లరేగడి మట్టిని పట్టపగలే యథేచ్ఛగా వెంచర్లకు తోలుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువుల నుంచి ఆయా వెంచర్ల పదుల సంఖ్యలో వాహనాలు విరామం లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. రైతులు తమ పొలాలకు నల్లరేగడి మట్టి కావాలంటే సవాలక్ష ఆంక్షలు పెట్టే అధికారులు.. జేసీబీలతో చెరువుల్లోని నల్లరేగడి మట్టిని తోడుకొని వెళ్తున్నా పట్టించుకోవడం లేదు. సాక్షాత్తూ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఏదులాపురం చెరువు నుంచి రియల్టర్లు యథేచ్ఛగా నల్లరేగడి మట్టిని తరలించుకెళ్తున్నా, ఆ వాహనాల రద్దీ కారణంగా తమ ఇంటి ఎదుట రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు మొరపెట్టుకుంటున్నా అధికారులెవరూ స్పందించడంలేదు. అయితే, చెరువుల్లో ఇలా భారీ గుంతలతో తవ్వకాలు చేపట్టి వదిలేస్తే వర్షాకాలం సీజన్‌లో చెరువులు నిండినప్పుడు పశువులుగానీ, మనుషులుగానీ అటు వెళ్తే మునిగిపోయే ప్రమాదాలే లేకపోలేదు.

దుర్వినియోగం చేసే వారిపై చర్యలు తప్పవు

చెరువు మట్టిని పంట పొలాలకు కాకుండా ఇతర అవసరాలకు తరలించే వ్యక్తులపై చర్యలు తప్పవు. పాలేరు నియోజకవర్గంలో 311 చెరువులు, కుంటలకు గాను.. దాదాపుగా 150 కుంటలు, చెరువుల్లోని మట్టిని రైతులకు అందించేందుకు నిర్ణయించాం. అయితే కొందరు వ్యక్తులు రైతుల పేరుతో రియల్ ఎస్టేట్ భూములకు చెరువు మట్టిని తరలిస్తున్నారని ఖమ్మం రూరల్ నుంచి ఫిర్యాదు వచ్చాయి. దీంతో ఇటీవల క్షేత్రస్థాయిలో ఏదులాపురం చెరువును పరిశీలించాం. స్థానిక అధికారులకు సూచనలు చేశాం. అనుమతిలేకుండా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. **–మంగళపుడి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ, పాలేరు డివిజన్**